సంపుటి : 13 | సంచిక : 5

జూలై-ఆగష్టు 2025

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



క్రీస్తు మనలను
స్వతంత్రులనుగా చేసియున్నాడు.



# “మనస్సులోని మాట”

దేవుని స్పర్శ పాఠకులైన మీ అందరికీ
శుభములు.

మీరంతా బాగున్నారని భావిస్తున్నాను. ఒకవేళ ఏదైనా ఇబ్బంది, బాధ, కష్టం ఉన్నా వాటి నుండి మనల్ని దేవుడు విడిపించి, క్షేమాన్ని కలుగజేస్తాడనే నిరీక్షణ గలవారమై ముందుకు వెళ్ళవలసి ఉంది. ఇకపోతే సంవత్సరంలో సగం కాలం గడిచిపోయింది, మరొక ఆరు నెలలు మనముందు ఉన్నాయి. ఈ జూలై ఆగష్టు నెల దేవుడు ఆయన కృపను, దయను చూపించునట్లుగా మనం ఆయనను వేడుకోవలసినవారమై ఉన్నాము. ముఖ్యంగా ఈ నెలలో వర్షాలు సక్రమంగా పడి వ్యవసాయ దారులకు అవి ప్రయోజనకరముగా ఉండాలని, ప్రాజెక్టులు కూడా నిండి రాబోయే సంవత్సర కాలానికి సాగు నీరు, త్రాగు నీరు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలని మనం దేవున్ని వేడుకోవలసినవారమైయున్నాము.

అదే సమయంలో ప్రభువు నందు విశ్వాసం కలిగి ఆయనను నమ్మిన మనందరి జీవితాలలో కేవలం మనకోసం, మన కుటుంబ అవసరాలకోసమే కాకుండా మన చుట్టూ ఉన్న సమాజం, మన రాష్ట్రం, దేశములోని మనుష్యులందరికొరకు ప్రార్థన చేయవలసినవారమైయున్నాము. ఈ విషయాన్ని స్పర్శ పాఠకులైన మీరందరూ గ్రహించాలని కోరుకుంటున్నాను. మనం ఎంతగా విశాలమైన హృదయాన్ని కలిగి  ఉంటామో, అంతగా దేవుని యొక్క కృప కూడా మన జీవితంలో విస్తరిస్తుంది. అనేకమందికి ఈ విషయం తెలియక సంకుచితమైన భావంతో బ్రతుకుతూ దైవ కృపను సమృద్ధిగా పొందలేక జీవితంలో ఎంతో వెనకపడిపోతూ ఉంటారు. మీరైతే అలా కాకుండా మీ అంతఃకరణాలను అంటే మీ యొక్క అంతరంగపు ఆలోచనలన్నిటిని విశాలపరచుకొని ఉండాలని, అలాగే దైవకృపను పొందుకునే విషయములో దేవుని యొక్క సహాయము సమృద్ధిగా పొందాలని కోరుకుంటున్నాను. ఈ జూలై, ఆగష్టు మాసమంతా మీకు, మీ పిల్లలకు, క్రొత్త సంవత్సరం చదువులలో స్కూల్లో జాయిన్ అయ్యిన పిల్లలందరికి దేవుడు తన కృపను సమృద్ధిగా అనుగ్రహించును గాక.  ఈ రెండు నెలలకాలము దేవుడు మీ ప్రతి అవసరమును తీర్చును గాక!

అట్టి భాగ్యన్ని  ప్రభువు దయచేయును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 13 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2025

# దేవుని స్పర్శ

## ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


| | |
|---|---|
| దేవుని ఆశీర్వాదము పొందుకొనుట | 2 |
| హతసాక్షులు | 6 |
| రాహాబు (స్త్రీల ప్రత్యేకం) | 9 |
| జాన్ వెస్లీ -33వ భాగం | 11 |
| దేవుని ఉగ్రత-క్రీస్తు ప్రేమ(బాలల శీర్షిక) | 13 |
| నా జీవితములో దేవుడు చేసిన మేలులు(సాక్ష్యము) | 15 |
| యేసయ్య రాకడ | 17 |
| మనస్థత్త్వ విధానాలు | 20 |
| దైవ చిత్తాన్వేషణ(యౌవనుల భాగం) | 22 |
| Finding God`s Will (english) | 24 |
| బైబిల్ క్విజ్ - 101 | 26 |
| జన్మదిన శుభాకాంక్షలు | 27 |


మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227

# దేవుని ఆశీర్వాదం పొందుకొనుట

బ్రదర్. ఎపఫ్రా

**"గొఱ్ఱెల గొప్ప కాపరియైన యేసు అను మన ప్రభువును నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమునుబట్టి మృతులలోనుండి లేపిన సమాధానకర్తయగు దేవుడు, యేసుక్రీస్తుద్వారా తన దృష్టికి అనుకూలమైనదానిని మనలో జరిగించుచు, ప్రతి మంచి విషయములోను తన చిత్తప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక. యేసుక్రీస్తుకు యుగయుగములకు మహిమ కలుగును గాక." ఆమేన్. హెబ్రీ 13:20-21**

ఇక్కడ గొఱ్ఱెల గొప్ప కాపరి అనగా మన ప్రభువైన యేసుక్రీస్తు, గొప్ప కాపరి అనేది కేవలము ఆయనకే చెందుతుంది ఇంక ఆ మాటకు ఎవ్వరూ అర్హులు కారు. యేసుక్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైన దానిని మనలో జరిగించుట అనగా దేవునికి అనుకూలమైన దానిని మనలో జరిగిస్తూ ఉండటం. చాలాసార్లు మనము నాకెందుకు ఇలా జరిగింది, అలా జరిగింది, ఈ విధంగా కాక వేరొక విధంగా జరిగితే బాగుండేది కదా అని తలంచుచూ ఉంటాము. మన జీవితాలలో మనం జరగాలని అనుకుంటున్న విధంగా జరిగితే ఎంతోమంది దేవుని రాజ్యాన్ని పోగొట్టుకుంటారు. కారణమేమిటంటే, మన జీవితానికి ఏ విషయంలో ఏ విధంగా చేస్తే ఆయనలో మనం అంతం వరకు నిలిచి ఉంటామో ఆయన బాగుగా యెరిగిన వాడు గనుక తన దృష్టికి అనుకూలమైనదానిని చేస్తూ వెళ్తూ ఉంటాడు. అందుకే ఆత్మీయంగా ఎదిగిన వాళ్ళందరూ ఏదైనా వారి జీవితంలో వారు కోరుకొననిది లేక ఎన్నడూ ఇష్టపడనిది ఏదైనా సంభవించినప్పుడు కొంత బాధ కలిగినప్పటికి, దేవుడు ఎందుకు అనుమతించాడో అది నాకు ఇప్పుడు అర్థం కావడం లేదు కానీ ఆయన ఎప్పుడూ కూడా తన దృష్టికి అనుకూలమైనదానిని జరిగిస్తాడు అని సాగిపోతారు. దేవుని విషయమై సరిగా అవగాహన లేనివాళ్ళు, దైవభక్తిలో బలహీనంగా ఉన్నవాళ్ళు కృంగిపోయి, కుమిలిపోయి నాకే ఎందుకిలా జరగాలి అని అనుకుంటారు.

ఆ మొట్టమొదటి క్రైస్తవ సంఘములో స్తెఫను అను ఒక యవ్వనస్తుడు ఉండేవాడు. ఇతను ఎవరంటే ఆ సంఘములో ఉన్న నాయకులు పరిచర్య చేయడానికి ఏర్పరచుకున్న కొందరిలో ఒక వ్యక్తి. ఇతను పరిచర్య చేయటమే కాకుండా, దేవుని అభిషేకము కలిగినవాడై దేవుని గురించి చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అలా చెప్తూ, ఒకరోజు అయ్యో....మీరు ప్రభువును ఎరుగకుండా, ఎందుకు ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు? అన్నాడు. ఎందుకంటే నా జనాంగము, నా ప్రజలైన వీరు వాగ్దానసంబంధులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబు యొక్క సంతానమైయుండి, దేవునిని తెలుసుకోకుండా, మెస్సయ్యా వచ్చాడని, రక్షకుడిని దేవుడు పంపాడని

నమ్మనిస్థితిలో ఉన్నారనే బాధతో మాట్లాడుతున్న అతడిని చెప్తూండగానే రాళ్ళతోకొట్టి చంపే శారు. ఆ రాళ్ళ దెబ్బలు తింటూ, చనిపోతూ కూడా స్తెఫను ఒక మాట అన్నాడు **"తండ్రీ - ఈ పాపము వారి మీద మోపకు"** అని. మరి చనిపోయిన ఆ కుమారునిబట్టి అతని తల్లి ఏమను కోవాలి? మిగతా వాళ్ళందరి కొడుకులు బాగానే ఉన్నారు, నా కొడుకే బలైపోవాలా... అంద రూ మౌనంగా కూర్చున్నారు, నా కుమారుడు వెళ్ళి చనిపోయాడు అని అనవచ్చు కానీ ఆ తల్లి, ఆ కుటుంబము మా కుమారుడు దేవుని కొరకు హతసాక్షిగా అయ్యే ఒక గొప్ప భాగ్యము దొరికింది అని దేవునిని స్తుతించారు.

హతసాక్షి అంటే తెలుసా? దేవునికొరకు హతమై ఒక సాక్షిగా నిలబడేవాడే హతసాక్షి. లోకానుసారంగా చూస్తే ఎవరూ కుమారున్ని పోగొట్టుకోవటానికి, ప్రాణాన్ని పోగొట్టుకోవ టానికి ఇష్టపడరు. ఆ ఒక్క స్తెఫను ప్రాణం, రక్తము, త్యాగము వలన పౌలు అనే వ్యక్తి సౌలుగా ఉంటే పౌలుగా మార్చి, మనం చదువుతున్న ఈ బైబిల్ గ్రంథంలో అనేక పత్రికలు రాసే ఒక అభిషిక్తునిగా దేవుడు చేసాడు. యేసుక్రీస్తు సిలువలోపడిన శ్రమల తరువాత అంత అత్యధి కమైన శ్రమలు పొందిన వ్యక్తి అపొస్తలుడైన పౌలు. ఆ యవ్వనస్తుని యొక్క త్యాగము పౌలును వేలాదిమందిని రక్షించే అద్భుతమైన సేవకునిగా నిలువబెట్టింది. కాబట్టి మన జీవితములో దేవుడు ఏది అనుమతించాడో, అంగీకరించాడో దానిని ఎప్పుడూ, ఎవ్వరూ త్రోసి వేయవద్దు. దేవునికొరకు శ్రమపడడం జీవితములో దేవుడు మనకిచ్చిన ధన్యత.

**"యేసు క్రీస్తుద్వారా తన దృష్టికి అనుకూలమైనదానిని మనలో జరిగించుచు, ప్రతి మంచి విషయములోను తన చిత్తప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక. యేసు క్రీస్తుకు యుగయుగములకు మహిమ కలుగునుగాక. ఆమెన్. హెబ్రీ13 : 21"**

యేసుక్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైనదానిని మనలో జరిగిస్తూ, ప్రతి మంచి విషయంలోనూ తన చిత్తప్రకారముగా చేయుటకు మనల్ని స్థిరపరచాలని హెబ్రీ గ్రంథకర్త కోరుకుంటున్నాడు, మనం కూడా ప్రతి మంచివిషయంలోనూ దైవచిత్తాన్ని చేయటానికి దేవుడు మనల్ని బలపరచాలని కోరుకోవాలి. ఒకరోజు పరలోకానికి వెళ్ళిన తర్వాత భళా!.. నమ్మకమైన దాసురాలా/ దాసుడా రా...నా దగ్గరికి. నువ్వు చాలా నమ్మ కమైనదానివి/ నమ్మక మైనవాడివి అని ప్రభువు పిలవాలంటే, మనము ప్రతి మంచి విషయమునూ చేయడానికి మన యొక్క జీవితాలలో సిద్ధబాటు కలిగి ఉండాలి. ప్రతి మంచి విషయంలోనూ అంటే ఉదాహర ణకి ఎవరికైనా ఏదైనా కష్టం అని విన్నప్పుడు దేవునిసన్నిధిలో మౌనంగా ఉండి, ప్రభువా ఈ కష్టంలో ఉన్న నా సహోదరుని కొరకు నేను చేస్తున్న ఈ ప్రార్థన విని సహాయం చేయి తండ్రి అని దేవునిని వేడుకోవడం. నా సంఘంలో కష్టంలో ఉన్న కుటుంబం కొరకు మేలు చెయ్యి తండ్రి అని ప్రార్థన చేయడం ఎంత అమూల్యమైనదో తెలుసా!

**"సమాధానకర్తయగు ప్రభువుతానే యెల్లప్పుడును ప్రతి విధముచేతను మీకు సమాధానము అనుగ్రహించును గాక. ప్రభువు మీకందరికి తోడైయుండును గాక." 2 థెస్స 3:16**

దేవుడు ఎందుకు తనకు ఇష్టమైనదానిని, అనుకూలమైనదానిని మన జీవితంలో జరిగిస్తాడంటే మనము సమాధానంగా బ్రతకడానికి, క్షేమంగా ఉండడానికి మాత్రమే. యుగ యుగములు ఆయనతో కూడా మనం ఉండడానికి ఆయన మన జీవితంలో తనకు అనుకూల మైన వాటిని జరిగిస్తూ ఉంటాడు. కానీ మనం ఏమి కోరుకుంటామంటే, భవిష్యత్తు మనకు తెలి యదు కాబట్టి దేవునికి అనుకూలమైనది కాకుండా మనకు అనుకూలమైనవన్నీ జరగాలని కోరుకుంటాం. కానీ నిజముగా మన ఆలోచనలు, మనమనుకున్నవి జరిగితే మన జీవితం ఎంత నరకప్రాయంగా మారుతుందో గ్రహిస్తే ఆలాగు కోరుకోము. మన పిల్లలు బాధపడటం, నశించిపోవడం ఏలాగు మనము చూడలేమో ఆలాగే మన తండ్రియైన దేవుడు కూడా మన ఇష్టాలను చేస్తూ మనం బాధలో ఉండాలని, నశించిపోవాలని, నరకంలో ఉండాలని కోరుకో డు, చూడలేడు. ఈ భూసంబంధమైన తల్లిదండ్రులకంటే ఆ పరలోకతండ్రి మనలను మిక్కిలి గా ప్రేమిస్తున్నవాడు. గనుక ఆయన ఏం కోరుకుంటున్నాడంటే తనకు అనుకూలమైన దానిని మన జీవితంలో జరిగిస్తూ మనము ఎల్లప్పుడూ సమాధానముగా, క్షేమముగా, నెమ్మదిగా ఉం డాలని, ప్రతిమంచికార్యములో, మంచిపనిలో పాలిభాగస్తులమవ్వాలని కోరుకుంటున్నాడు.

**"వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మన యొప్పు కొనినది నిశ్చలముగా పట్టుకొందము. కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము. హెబ్రీ 10: 23-25**

వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు. తనకు అనుకూలమైన వాటిని మనలో జరిగిస్తూ దేవుడు ఎవరికైనా కీడు చేయాలని అనుకుంటాడా? ఎంతమాత్రం అనుకోడు. దేవుడు తనకు అనుకూలమైన వాటిని మనలో జరిగించేది మన మేలు, మంచి, మన భవిష్యత్తు క్షేమకరంగా ఉండటం కొరకే. కొన్నిసార్లు మనం మన ఇష్టానుసారంగా సాగిపోతూ, ఎక్కడికి వెళ్తామో తెలి యనివారిగా ఉన్నట్లయితే మనల్ని విరగగొట్టైన సరైన మార్గంలో నడిపిస్తాడు, అదే ఆయన మన కోసం మన జీవితంలో చేసే మేలు. దీనిని గ్రహించక మనమే జ్ఞానవంతులమని, మనకే అన్నీ తెలుసని, మనము చేసినదే కరెక్ట్ అని బ్రతుకుతూ ఉంటాము. మనకు 100 సం॥లు వచ్చినా లేక 120 సం॥లు బ్రతికిన మన యొక్క జ్ఞానమునకు పరిమితం ఉంది కానీ ఆయన అనంతజ్ఞాని. ఆ అనంతజ్ఞాని మన జీవితంలో తనకు అనుకూలమైన వాటిని అనుమతిస్తున్నా డంటే నీకు ఎన్ని సంవత్సరములున్నా, నీవెంత జ్ఞానవంతుడవైనా, సమాజంలో నిన్ను ఎంత ఘనుడవన్నా, వ్యాపారంలో నీవు తెలివైనవాడివైనా, లేక ఆత్మీయతలో నీవు అందరికంటే ఉన్న

తమైన స్థానంలో ఉన్నవాడివైనా కానీ నీ జీవితంలో జరుగుచున్న వాటిని దేవుని యొక్క జ్ఞానాన్ని బట్టి చూస్తే, అర్థం కాని సంగతులు ఎన్నో ఉంటాయి కాబట్టి ఆయన అనుమతించినదానికి అంగీకరించడమే నేను చేయవలసిన పని అని గ్రహించాలి. వాగ్దానము చేసిన వాడు నమ్మదగినవాడని మనం విశ్వసిస్తే, దేవుడు నా సంగతి చూసుకుంటాడు, నన్ను నడిపిస్తాడు, నాకు తోడుగా ఉంటాడు అని ధైర్యంగా ఉండి, నిరీక్షణ విషయములో నిశ్చలముగా అంటే స్థిరముగా ఉంటాము.

ప్రభువా నీకు అనుకూలమైనదానినే నా జీవితంలో జరిగించు కానీ నాకు అనుకూలమైనది కాదు. నీకు ఇష్టమైన వాటినే నా జీవితంలో నెరవేర్చు కానీ నాకు ఇష్టమైనవి కాదు. ఈ ప్రపంచంలో మనము ఎవరమైనా మన ఇష్టాలు, మనకి అనుకూలమైనవి జరిగిస్తే ఖచ్చితంగా నరకంలో ఉంటాము. మనందరి శరీరము ఆదాము స్వభావంతో కూడుకున్నది, ఈ శరీరములో ఉన్న అనేక బలహీనతల మీద యేసురక్తం ప్రోక్షించబడి మనల్ని యేసుక్రీస్తు స్వభావంలోనికి నడిపిస్తుంది. కాబట్టి నా దృష్టికి అనుకూలమైనది కాదయ్యా నీ దృష్టికి అనుకూలమైనది నా జీవితంలో నెరవేర్చు అని ఎవరు మనస్ఫూర్తిగా దేవునికి తమ్ముని తాము అప్పగించుకుంటారో దేవుడు తన దృష్టికి అనుకూలమైనదానిని వారి జీవితంలో నెరవేర్చి ఆయన రాజ్యమునకు వారసులుగానూ, ఈ భూమిమీద ఉన్నంత కాలం స్థిరపరచి, విస్తరింపచేసి, ఆశీర్వదించి ముందుకు నడిపిస్తాడు.

**అట్టి భాగ్యం దేవుడు మనకు దయచేయును గాక.**

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

**ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,**
**వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# హతసాక్షులు

## జోసఫ్ మరియు మైకెల్ హోఫర్

### 1918లో కాన్‌సాస్, అమెరికాలో మరణించాడు

(గత సంచిక తరువాయి భాగం)

'యుద్ధము చేయవలసిన అవసరములేని ఏదైనా వేరు విభాగంలో పని చేయుటకు సమ్మతమేనా?'

'లేదు,మేము చేయలేము.'

'దానికి కారణములు ఏమిటి?'

'అవి అన్ని కూడా యుద్ధము కొరకే గనుక. మేము చేయగలిగినదంతా కూడా, ఒక వ్యవసాయ క్షేత్రంలో, పేదల కొరకు, అవసరములో ఉన్న అమెరికా వారి కొరకు పని చేయగలము.'

'పేదలు అవసరములో ఉన్న వారు అనగా మీ ఉద్దేశ్యములో ఎవరు?'

'వారికి వారు సహాయం చేసుకొనలేని వారు.'

'యుద్ధములో గాయపడి వికలాంగులైన వారిని ఈ జాబితాలో చేర్చుతారా?'

'అవును, వారు పేదలు, అవసరములో ఉన్న వారు .'

ఒకవేళ నీవు సేవలో ఉండి, వైద్య సేవలో ఉన్న యెడల గాయపడిన సైనికులకు వైద్యసేవ చేయవలసి వచ్చినచో నీ మనస్సాక్షి మరియు నీ సంఘము యొక్క బోధలు దానిని అంగీకరిస్తాయా?

'మేము ఆ విధముగా చేయలేము, ఎందుకనిన స్వస్థత పొందిన తరువాత తిరిగి యుద్ధములో పోరాడుతాడు గనుక. అది యుద్ధము చేయుటకు సహాయము చేసినట్లు గనుక మేము చెయ్యలేము.'

ఒకవేళ గాయపడిన సైనికులున్న యెడల, వారికి సహాయం చెయ్యరా?వారు బాగుపడి మరలా యుద్దము చేయుటకు పోతారనా? అదేనా కారణము.'

ఒకవేళ ప్రభుత్వము వారు నిన్ను ఒక ప్రభుత్వ సంస్థలో పెట్టి సైనికుల కొరకు గోధుమలు

 నీకు కలిగిన దానిలో సంతృప్తి లేకపోతే ఎన్ని ఉన్నా అసంతృప్తితోనే ఉంటావు.

పండించమంటే చెయ్యగలరా?.

'లేదు.'

'మీ మతము ఏ రకమైన పోరాటమునకు ఒప్పుకుంటుంది?'

'లేదు.'

నీ పిడికిలితో పోరాడవా.

మేము దేవదూతలము కాము. చిన్న పిల్లలు కొన్ని సార్లు చేతులతో రక్కుకుంటారు. మేము శిక్షింపబడతాము. మా మతము దానిని అనుమతించదు.

'ఎవరైనా ఒక వ్యక్తి నీ సోదరి పై దాడి చేస్తే నీవు పోరాడవా?'

'లేదు.'

'నీవు అతనిని చంపుతావా?'

'లేదు.'

'అయితే ఏమి చేస్తావు.'

'ఒకవేళ ఆమెను విడిపించగలిగితే, అతనిని పట్టుకొంటాను. వీలయితే ఆ పని చేస్తాను. లేనియెడల అతనిని వదిలివేస్తాను. కానీ చంపను. అది నా మతమునకు విరుద్ధమైనది.'

ఆ నలుగురు వ్యక్తులు, నేరములకు దోషులుగా తీర్చబడ్డారు. వారికి ఇచ్చిన శిక్ష, అగౌరవపరచుట, వేతనము కోల్పోవుట, మరియు కారాగారం. మైకెల్ హోఫర్ తన భార్య అయిన మరియతో ఈ విధముగా పంచుకున్నాడు.

శనివారము వాళ్ళు వచ్చి మాకు ఇవ్వబడిన శిక్షను ప్రకటించారు. కాలిఫోర్నియాలో ఉన్న ఆల్‌కట్రాజ్‌లో ఇరవై సంవత్సరములు కఠిన జైలు శిక్ష. మా కొరకు ఇంకా ఏమి వేచియున్నదో పరలోకపుతండ్రికి తెలుసు. మా విశ్వాసమును ఆయనపై ఉంచి, మాకు ఏమి జరగనై యున్నదో దాని కొరకు సహనముతో వేచియుండవలసి ఉన్నది. ఎటువంటి భారము మాపై మోపబడినను, దానిని భరించుటకు మార్గము చూపుతాడు. మేము విచారపడినట్లయితే మా సిలువను, మా బాధను మరింత బాధాకరముగా చేసుకుంటాము. ప్రభువు మాతో కూడా ఉన్నాడు. (అనగా ఆల్ కట్రాజ్) ఆయన తన వారికి వాగ్ధానము చేసియున్నాడు, వారు అగ్ని గుండా పోవునప్పుడు ఆయన వారి ప్రక్కన ఉంటానని తద్వారా మంటలు వారిని కాల్చవు.

ఈ మధ్యకాలములో ఆంద్రూవుర్‌ట్జ్, హోఫర్ సోదరుల నుండి మరియు జేకబ్ వైప్ నుండి క్యాంపు లూయిస్‌కు వచ్చిన తరువాత వారి నుండి దూరమైన వ్యక్తి, తన న్యాయ విచారణకు

నిలువవలసి వచ్చింది. అతి కష్టమైన శారీరక కష్టాలను కలిగించి, అతనిని పని చేయించుటకు ప్రయత్నము చేసిన విధానమును గురించి చెప్పాడు. అతి చల్లనినీళ్లలో ముంచబడుట, తరువాత నేలపై లాగుట ద్వారా చర్మములో మేకులు గుచ్చుకొనుట, ఇంకా ఇటువంటి కష్టములు ఎన్నో. చివరకు ఆ క్యాంపు తోటలో పని చేయుటకు సమ్మతించాడు, కానీ అదీ కూడా ఒంటరిగా చేయడానికి, యూనిఫారములో ఉన్న వ్యక్తులతో కలిసి కాకుండా.

క్యాంప్ లూయిస్‌లో రెండు నెలలు గడచిన తరువాత, వారు నలుగురు కూడా ఆల్ కట్రాజ్ కు బయలుదేరారు. వారు ఇద్దరిద్దరుగా గొలుసులతో కట్టబడి, నలుగురు లెఫ్టినెంటులు వారిని నడిపించుచుండగా, రెండు దినముల తరువాత సెయింటు ఫ్రాన్సిస్కోచే దగ్గర ఉన్న చాలా పేరు మోసిన సముద్రపు ఒడ్డునకు చేరారు. యుద్ధ ఖైదీలను ఉంచు స్థలములలో ఇది ఒకటి. ఇది అభివృద్ధి కార్యక్రమములకు తెలియబడిన స్థలము. ఈ స్థలము కోలోనల్ గెరార్డ్ ఆధిపత్య ములో ఉండినది. అక్కడ ఉన్న ఖైదీలు 'శిష్యులు'గా పిలువబడేవారు. ఇక్కడి వారు వారి వృత్తి వ్యాపారములకు సంబంధించిన తర్ఫీదు పొందేవారు. ఒక పెద్ద లైబ్రరీ కూడా ఉండినది. అయితే ఈ కార్యక్రమములన్నీ కూడా, ఈ నలుగురు ఖైదీలకు అందుబాటులో లేవు.

అక్కడకు వచ్చిన తరువాత, కొన్ని స్విచ్ బాక్స్‌ల సహాయముతో ఆ జైలు యొక్క ఎత్తైన స్థలమునకు ఎక్కగలిగారు. వెళ్ళిన తరువాత యూనిఫారమ్ ధరించుటకు పని చేయుటకు నిరాకరించారు. చివరకు చాలా మెట్లు ద్వారా క్రింద ఉన్నటువంటి చీకటి స్థలములోనికి తీసుకుని వెళ్ళారు. ప్రతి గది కూడా ఆరున్నర అడుగుల మరియు ఎనిమిది అడుగుల లోతు గల గదులలో ఉంచబడ్డారు. వారు చలితో, తడితో ఉన్నారు కానీ అక్కడ ఉన్న యూనిఫారము లు వేసుకొనుటకు నిరాకరించారు. అక్కడకు వచ్చిన ప్రారంభ దినములలో వారికి సగము గ్లాసు నీళ్లు మాత్రము ఇవ్వబడినవి. మరి వేరే ఆహారము ఏమి లేదు.

చేతి మీద చెయ్యి పెట్టి, వారి చేతులు అక్కడ స్థంభమునకు గొలుసులతో కట్టి వేశారు. ఆ గొలుసులు పైకి లాగబడుటచే వారి కాలి వ్రేళ్ళు మాత్రం భూమిని తాకేవి. దీనిని 'హైకఫింగ్' అని పిలిచేవారు. చిత్రహింస చేయుటలో ఇది ఒక విధానము. డేవిడ్ హోఫర్ తన టాయిలెట్ డబ్బాను దగ్గరకు లాగి దానిపై నిలబడుట ద్వారా తన చేతుల నొప్పిని తగ్గించుకొనుటకు ప్రయ త్నము చేశాడు. రాత్రింబగళ్ళు చీకటిలో నివసించేవారు. అప్పుడప్పుడు వారి కాపలా వారు వారిని దర్శించి కొరడాలతో కొట్టేవారు. ఆ విధంగా ఐదు దినములు ఒంటరిగా బంధింపబ డిన తరువాత వాళ్ల కాపలా వాళ్లు వారిని బయటకు తీసుకుని వచ్చినప్పుడు వారి చేతులు వాచి వాళ్ల జాకెట్టులలో పట్టలేదు.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# రాహాబు

సిస్టర్. విజయ

**"విశ్వాసమునుబట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపకపోయెను " హెబ్రీ11:31**

పైన ఉన్న వాక్యములో విశ్వాసమునుబట్టి అని వ్రాయబడుట మనం గమనిస్తున్నాం. విశ్వాసము అనగా నిరీక్షించుచున్న వాటి యొక్క నిజస్వరూపం. నేడు అనేకులకు విశ్వాసము అనే దానికి అర్థం కూడా తెలీదు. లేనిదానిని ఉన్నట్లుగా భావించేది విశ్వాసము.

జీవితములో వినిన మాటలను బట్టి విశ్వాసము అన్న దానిని సంపాదించుకుంటాం. రాహాబు అనే స్త్రీ వేశ్య, సమాజంలో అందరి చేత తృణీకరింపబడినది, ఏ మాత్రమూ విలువ లేనిది. ఆమె ఇల్లు యెరికో ప్రాకారపు గోడపైన కట్టబడివున్నది. ఆ గోడ ఇంచుమించు 30 అడుగుల ఎత్తు. ఇశ్రాయేలీయుల కానాను ప్రయాణంలో యెరికో అనే పట్టణము అడ్డముగా ఉన్నది. అందుకు వారు ఆ యెరికోను జయించి ముందుకు వెళ్ళాలని ప్రయత్నిస్తూ యుద్ధం చేయడానికి ముందు ఇద్దరు వేగులవారిని అక్కడికి పంపడం జరిగింది. వారు ఆ పట్టణంలోనికి ప్రవేశించి రాహాబు ఇంట బసచేశారు. **"అప్పుడు రాహాబు వారితో-యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు మీవలన మాకు భయము పుట్టుననియు, మీ భయమువలన ఈ దేశ నివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. .....మీ యెదుట యెహోవా యెట్లు సముద్రపు నీరు ఏలాగు ఆరిపోచేసెనో, శత్రురాజులను మీరేలాగు నిర్మూలము చేసితిరో మేము వినినప్పుడు మా గుండెలు కరిగిపోయెను.మీ దేవుడు పైన ఆకాశమందును, క్రింద భూమియందును దేవుడే. మీ ఎదుట ఎట్టి మనుష్యులకైననూ ధైర్యము ఏ మాత్రము ఉండదు"(యెహో 2:9-11)** అని చెప్పింది. ఈ సమాచారం నాయకుడైన యెహోషువకు ఎంతో ప్రోత్సాహమును ఇచ్చింది. రాహాబు ఒక వేశ్యే కానీ ఆమె కలిగి ఉన్న విశ్వాసం తన మాటలు మరియు క్రియల ద్వారా వెల్లడి అయినప్పుడు ఆమె ఎంతో ఉపయోగకరంగా ఉంది.


దేవుని దృష్టిలో రాహాబుకు యెరికో పట్టణస్థులకు ఉన్న వ్యత్యాసం ఏమిటి? రాహాబు యొక్క విశ్వాసం దేవుని దృష్టిలో ఎందుకు ఘనమైనది? క్రొత్త నిబంధన గ్రంధములో కూడా ఆమె విశ్వాసం గూర్చి జ్ఞాపకం చేయడం జరిగింది. బాల్యము నుండి ఆయనను ఎరుగకపోయిన ప్పటికిని, ఆ దేవుని గురించి మాట వినగానే దృఢంగా ఆయనను నమ్మగలిగింది. యెరికో ప్రజల యొక్క ఆలోచనా విధానం దీనికి పూర్తి విరుద్ధమైనది. వారు నిజ దేవునిని ఎంత మాత్రం నమ్మినవారుకారు. దేవుని ప్రజలను పూర్తిగా వ్యతిరేకించిన వారు. అందుకే యెరికో పట్టణం మొత్తంలో రాహాబు ఇల్లు ఒక్కటే సురక్షిత ప్రదేశంగా మారింది. ఎర్రని దారం అనగా రక్తరంగు దారం, బలి అర్పణ మూలంగా కలిగిన భద్రతను సూచిస్తూ ఉంది. **(నిర్గమ 12:7-13)**

రాహాబు తన విశ్వాసమునుబట్టి తన కుటుంబ సభ్యులందరికి రక్షణ సాధనంగా ఉండ గలిగింది. ఆ పట్టణంలో గొప్ప గొప్ప జ్ఞానవంతులు, ధనవంతులు యుద్ధశూరులు ఉన్నారు. వారు ఎవ్వరూ కూడా వారి కుటుంబములను కాపాడుకోలేకపోయారు. యెరికో పట్టణంలో వెండి, బంగారం, ఇత్తడి, వెలగలిగిన సమస్తము నశించిపోవడం కనబడుతూ ఉంది. రాజ్యము ను పరిపాలన చేసే రాజులకు సహితము దొరకని ఈ భాగ్యము ఆమెకు ఆమె ఇంటి వారికి దొరికింది.

క్రొత్త నిబంధన ప్రజలమైన మనము రాహాబు ద్వారా నేర్చుకొనవలసినది ఎంతో ఉంది. ఆమె గొప్ప జ్ఞానవంతురాలు కాకపోయిన, ఉన్నతమైన కుటుంబ నేపధ్యములో నుండి రాక పోయిన సత్య దేవుని గూర్చి వినిన దానిని విశ్వసించడం ద్వారా తాను తన ఇంటివారు రక్షించ బడ్డారు. అంత మాత్రమే కాక రాహాబు మన పితరుడైన దావీదుకు పూర్వీకురాలు **"నయస్సోను శల్మానును కనెను, శల్మాను రాహాబునందు బోయజును కనెను, బోయజు రూతునందు ఓబేదును కనెను, ఓబేదు యెష్షయిని కనెను. (మత్తయి 1:5)** దావీదు వంశములోనే మన ప్రభు వైన యేసుక్రీస్తు పుట్టడం జరిగింది. ఎంత ధన్యత! ఒక వేశ్య హీనమైన స్థితి నుండి ఎలా ఉన్నత మైన స్థితికి చేరుకుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

చాలామంది స్త్రీలు తమ వైపు తాము చూచుకుంటూ నాకు జ్ఞానం లేదు, ఏదీ రాదు, మంచి దానిని కాను అని తలంచుచు స్వనీతితో బ్రతుకుతూ ఉంటారు. కృప అనగా అర్హత లేనివారిని అర్హులుగా చేసేది. తమని తాము హీనపరుచుకునేవారు కృపని తృణీకరించుచున్నారు అనే సంగతిని గ్రహించాలి. కనుక మన నీతిని బట్టి కాక మనము దేవునియందు ఉంచు విశ్వాస మును బట్టి కృపచేతనే రక్షించబడుచున్నాము. రాహాబు పాత నిబంధనా కాలంలో అపాయం నుండి రక్షించబడితే, నేడు నూతన నిబంధనా ప్రజలుగా యేసుక్రీస్తుని గూర్చిన సిలువమరణ, పునరుత్థానములను గూర్చి మనము విశ్వసించినయెడల భయంకరమైన నాశనం నుండి తప్పించబడి అనగా నిత్య అగ్నిగుండములో నుండి నిత్య జీవములోనికి చేర్చబడతాము.

**అట్టి విశ్వాసమును దేవుడు మనకందరికి దయచేయును గాక!**



# జాన్ వెస్లీ

**- సీరియల్ 33వ భాగము**

వెస్లీగారు కొంత బలము పుంజుకొని తన స్వరమెత్తి బిగ్గరగా ప్రార్థించెను. ఆ ప్రార్థనద్వారా ఆ దుష్టుల నాయకుడు ముట్టబడెను. అంతట వాడు "అయ్యా! నా జీవితము మీ కొరకు వ్యయపరతును. ఇక్కడ మిమ్ములనెవ్వరు ముట్టుకొనకుండ కాపాడెదను అనెను." అతనితో మరి ముగ్గురు చేరిరి. వారు వెస్లీగారి చుట్టూ నిలువబడి అల్లరిమూక నెదిరించిరి. ఇది చూచి జనసమూహము ఆశ్చర్యపడి వెనుదిరిగెను. ఈ క్రొత్త కాపరులు వెస్లీగారిని క్షేమముగా వెడ్నెస్ బరీలోని ఇంటికి చేర్చిరి. ఈ అల్లరి మూకల దౌర్జన్యమువలన వెస్లీ బట్టలు చిరిగెను, చేతిమీది చర్మము కొట్టుకొనిపోయెను. అప్పుడు తమ్ముడైన చార్లెస్, వెస్లీని చూచి "నిజమైన క్రైస్తవ యోధునివలె కన్పించుచుంటివి" అని అభినందించెను.

ఈ గొడవలమధ్య వెస్లీ ఏ కలవరము లేక నిర్భయముగా నిలిచెను. తన ప్రాణము కొరకు అర్రులు చాచుచున్న సమూహము మధ్య అతని సహనశీలత, చల్లని ప్రవర్తన, మిక్కిలి క్రూరులైన శత్రువులను సహా మార్చివేసెను.

రౌడీసమూహములు భక్తులైన మెథడిస్టువారి ఇండ్లమీదబడి కిటికీలను,గృహోపకరణములను పగులగొట్టివారిని గాయపరచినపుడు సహితము సహాయము చేయుటకు న్యాయాధిపతులు సహా తమ చిటికెన వ్రేలైన ఎత్తలేదు. ప్రసంగ పీఠములనుండి ఈ విశ్వాసులకు విరోధముగా అనేక ప్రసంగములు చేయబడెను. ఉన్నతాధికారుల నుండి ఇట్లు ప్రోత్సాహము లభించుచుండగా మెథడిస్టు విశ్వాసులు తమ ప్రాణములను దక్కించుకొనుటయే అద్భుతముగా ఉండెను.

ఒకసారి వెస్లీగారు కొండదిగుచుండగా నేల బాగుగా తడిసి సులువుగా జారునట్లుండెను. అంతట ఆయనను ఏలాగైనను క్రిందికి త్రోయవలెనని శత్రు సమూహములు కూడివచ్చిరిగాని దేవుడు వెస్లీని కాపాడెను. ఒక్క అడుగైనా క్రిందికి జారలేదు, పూర్తిగా దాటువరకు తొట్రిల్లలేదు. ఆయన బట్టలను పట్టుకొని చింపవలెనని చాచిన చేతులకు వస్త్రముపై పట్టు దొరుకలేదు. ఒక బలవంతుడు పెద్ద దుడ్డుకర్రతో వెనుకనుండి వెస్లీ తలపై కొట్టబోయెను, తల బ్రద్దలు చేయుటకు అట్టి దెబ్బ ఒక్కటి చాలును. వెస్లీ చుట్టూ మనుష్యులున్నందువలన ఎటు వైపునకు తప్పించుకొనలేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినను ప్రతిసారి దేవుడు దానిని ప్రక్కకు తొలగించి వెస్లీపై పడకుండ కాపాడెను.

ఇట్లు అనేకమార్లు దేవుడు వెస్లీని అద్భుతరీతిగా మరణమునుండి తప్పించెను. జనులు చెప్పలేని కోపముతో రెచ్చిపోయిరి. దయాదాక్షిణ్యములెరుగని దుష్టులు తన్నుచుట్టుకొనినప్పటికి తన స్వంత ఇంటిలో వాక్యము ధ్యానించుచు కూర్చొను రీతిగా వెస్లీమనస్సు నెమ్మదిగా ఉండెను. వెస్లీ బ్రాడ్‌ఫర్డ్‌కు ప్రసంగించుటకు వెళ్ళెను, అక్కడి అల్లరిమూక మృగములవలె వెస్లీపై పడవచ్చిరి.

ఒకడు బోధకునిపై విసరుటకు కుళ్ళిన గ్రుడ్లతో తన జేబులను నింపుకొని వచ్చెను. ఒక సత్పురుషుడు వెస్లీని తన ఇంటి ద్వారమునొద్ద నిలువబడి ప్రసంగించమని గోరెను. గనుక వెస్లీ అచ్చటికి వెళ్ళెను. ప్రసంగము ముగియు వరకు ప్రజలు నిశ్శబ్దముగా ఉండిరి, తరువాత కేకలు వేయ మొదలుబెట్టిరి. గ్రుడ్లు విసరవలెనని వచ్చిన వాడు మరి బిగ్గరగా కేకలు వేయుచుండెను. ప్రక్కనున్న యువకుడు ఇట్లు కేకలు వేయుచున్నదెవరని అతని వైపు చూచెను. అతని జేబులు నిండుగా ఉండుట గమనించి తన రెండు చేతులతో జేబులను అదిమెను. ఒక్క క్షణములో గ్రుడ్లు పగిలి దుర్గంధము అతనిని ముంచెత్తెను.

లాంక్‌షయర్‌లోని బోల్టెన్ అను వూరిలో వెస్లీ ప్రసంగమును భంగపరచవలెనని ఒకడు ఆయన చెవిదగ్గర అరచుచుండెను. దూరము నుండి యొకడు వెస్లీపై రాయి విసరగా అది అతని బుగ్గ మీదపడి గాయపరచబడెను, ఇక అరచువాని నోరుమూయబడెను. మరియొకడు వెస్లీని గ్రుద్దుటకై పిడికిలి బిగించుకొని ప్రజలను త్రోసికొనుచు ముందుకు వచ్చుచుండెను. వెనుక నుండి వెస్లీపై విసరబడిన రాయి ఇతని నొసటిని మోదెను. రక్తము కారుచుండగా అతడు వెనుదిరిగెను. మరియొకడు వెస్లీగారి దగ్గరకు వచ్చి ఆయనను చెంపపై కొట్టబోగా వేరొక దిశనుండి మొనతేలిన రాయివచ్చి తన చేతిని కొట్టెను. ఈలాగు దేవుడు అన్ని విధములైన దెబ్బలను ఆపి వెస్లీని ఏ అంతరాయము లేకుండ ప్రసంగింపజేసెను.

**సేకరించబడింది**

**(ఇంకా ఉంది)**



# "దేవుని ఉగ్రత-క్రీస్తు ప్రేమ"

హలో పిల్లలూ! Schools Open అయ్యాయి కదా Busy అయ్యిపోయారా?. బిజీ లైఫ్‌లో నేను మిమ్మల్ని disturb చేస్తున్నానా పిల్లలు. నేను కూడా మీతో ఏ FaceBookలోనో,Instaలోనో పరిచయమయితే మీకు బెస్ట్ ఫ్రెండ్‌ని అయ్యేదాన్ని But ఇలా Bookలో మీతో మాట్లాడుతుంటే మీకు Intrest ఉండటంలేదు కదా... నాక్కూడా ఈ Book ద్వారా ఒక Like And Subcribe చేసికోండి Please.....ఎందుకంటే ఈ Book ఎప్పటికీ మీతోనే ఉంటుంది. మిమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళిపోదు. నీకు తెలియని ఎన్నో సంగతులను తెలియచేస్తాము. new classesకు వెళ్ళినందుకు దేవుని కృతజ్ఞతలు చెప్పారు? Books,Bags కొనడానికి మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఉంటారు. So, వారికి కూడా Thanks చెప్పండి. వారికి విధేయులై ఉండటం మీ బాధ్యత. తల్లిదండ్రుల మాట వినడం వలన గొప్ప శిక్షనుండి తప్పించబడతారు.

క్రీస్తు ప్రేమనుబట్టి మనమంతా ఇప్పుడు ఇంత స్వేచ్ఛగా, మనకి నచ్చినట్లు జీవిస్తున్నాము కదా పిల్లలూ! అదే Before Christ ఎలా ఉండేదో మీకు తెలుసా?? For Example ఈ మాటలు చూడండి **ద్వితీ॥కా॥ 21:18-21"ఒకని కుమారుడు మొండివాడై తిరుగబడి తండ్రిమాట గాని తల్లి మాటగాని వినకయుండి, వారు అతని శిక్షించిన తరువాతయును అతడు వారికి విధేయుడు కాకపోయిన యెడల అతని తలిదండ్రులు అతని పట్టుకొని ఊరి గవినియొద్ద కూర్చుండు పెద్దల యొద్దకు అతని తీసుకొనివచ్చి, మా కుమారుడైన వీడు మొండివాడై తిరుగబడియున్నాడు, మా మాట వినక తిండిబోతును, త్రాగుబోతును ఆయెనని ఊరి పెద్దలతో చెప్పవలెను. అప్పుడు ఊరి ప్రజలందరు రాళ్లతో అతని చావ గొట్టవలెను. అట్లు ఆ చెడుతనమును నీ మధ్య నుండి పరిహరించుదువు. అప్పుడు ఇశ్రాయేలీయు లందరు విని భయపడుదురు".**

అమ్మ బాబోయ్!! ఎంత కఠినమైన శిక్ష కదా ఇది! యేసయ్య వచ్చి మనల్ని ఆ విధమైన శిక్షల నుండి విడిపించాడు. ప్రేమించే తల్లిదండ్రులను, పెద్దలను ఇచ్చి వారి ద్వారా మనకి భయభక్తులు నేర్పిస్తున్నారు. అవిధేయులైన వారిని శిక్షించి చావగొట్టే విధానము నుండి యేసుక్రీస్తు మార్పు తీసుకొనిరావడానికి మనకి రావలసిన ఆ శిక్షను తొలగించి మనకు బదులుగా ఆయన మరణించెను. మనము మారడానికి ఆయన కృపను చూపించి ఆయన పిల్లలుగా మనం జీవించాలని ఎన్నో అవకాశాలను ఇస్తున్నాడు. మన పరమతండ్రియైన దేవునికి అవిధేయులమైన మనం చనిపోవలసిన స్థానంలో ఆయన చనిపోయాడు కాబట్టి మనం మార్పు చెందే అవకాశం ఇవ్వటానికి ఆయనకి అధికారం అనుగ్రహించబడెను.

ఓ సండే స్కూల్ టీచర్ సండేస్కూల్ పిల్లలకు ఆత్మీయపాఠాలు నేర్పిస్తూ "దేవుడు కనిపించి మీకు ఏమి కావాలని అడిగితే, మీరు ఏమి కోరుకుంటారో వివరంగా వ్రాసి ఇవ్వండి" అని చెప్పి ఆ పిల్లలు రాసిన Papers ని ఇంటికి తీసుకువెళ్ళెను. సాయంత్రం ఆ పేపర్లు చదువుతూ, అందులో ఓ బాబు దేవున్ని కోరుకున్న కోరికను గూర్చి చదివి ఆ టీచర్ బహుగా ఏడుస్తూ ఉండ గా భర్త గమనించి, ఎందుకు తన భార్య అంతగా ఏడుస్తుందో అర్థంకాక దగ్గరకి వచ్చి... ఎందుకు ఏడుస్తున్నావు? అని అడిగెను. అందుకు ఆమె ఇదిగో ఈ Paper చదవండి అని ఆ పేపర్ ఇచ్చింది. అందులో ఏమున్నదంటే "ప్రభువా! నన్ను Cell Phone గా మార్చు ప్రభువా, మా ఇంట్లో Phoneకి ఏ స్థానం ఉందో ఆ స్థానాన్ని నేను పొందుకోవాలని ఆశిస్తున్నాను. మా ఇంట్లో నాకంటూ ప్రత్యేకత లేదు. మా మమ్మీ, డాడీ, మా అక్క, అన్నయ్య అందరూ Phone నే ఎక్కువగా ప్రేమిస్తారు, ప్రక్కనే పెట్టుకుని నిద్రపోతారు. నిద్రలేవగానే Phoneనే చూస్తారు. అందుకే ప్రభువా నన్ను Phone లాగా మార్చేయవా Please! అని వ్రాసి ఉంది.

మీరు కూడా అలానే అవ్వాలనుకుంటున్నారా పిల్లలూ? ప్రతి ఒక్కరు మొబైల్‌ని చాలా ఇష్టంగా వాడుతున్నారు. నిజమే ఈ tecnology, mediaలో మనం తెలుసుకున్నది కొంత వరకే. ఇంకా మనకు తెలియని సంగతులు ఎన్నో bibleలో ఉన్నాయి. వాటిని చదవడం ద్వారా నే గొప్పగొప్ప వ్యక్తులుగాను, కొందరు సైంటిస్ట్‌లుగాను అయ్యారు. ఇంతకముందు లేని అనేక వస్తువులను కనిపెట్టడం జరిగింది. Phone, విమానాలు ఇలా ఎన్నో మనిషికి దేవుడు ఇచ్చిన జ్ఞానంతోనే తయారుచేయబడ్డాయి.

ఈ జనరేషన్‌లో మీరు ప్రతీదీ reelsలోనో, shortsలోనో చెప్పినవే ఎక్కువగా నమ్ము తున్నారు. ద్వితీయోపదేశకాండములోని వాక్యములు ఆనాటి జీవన విధానం ఇవన్నీ బైబిల్ చదివితే ముఖ్యంగా మీరు నమ్మితే క్రీస్తు ఇప్పుడు మనల్ని ప్రేమించి ఎన్ని సంగతులు మనకు బయల్పరిచాడు అనేది గ్రహించగలము. **"దేవుడు జ్ఞానులకును, వివేకులకును సంగతులు మరుగుచేసి పసిబాలురకు బయలు పరచినాడని"** బైబిల్‌లో **(మత్తయి 11:25)** ఉంది.

ఫ్రెండ్స్.... కంటికి కనిపిస్తున్న ఈ భూసంబంధమైన వనరులను నమ్ముచున్నాము కదా! క్రీస్తు ప్రేమ నీకు కనబడట్లేదా? ప్రభువు త్యాగం నమ్మట్లేదా? బైబిల్ చదివిన యెడల ఉన్నది ఉన్నట్లుగా తెలుస్తుంది. అర్థంకాకపోతే ప్రార్థించు దేవుడు బయలుపరుస్తాడు, మత్తయి 11:25లో చెప్పినట్లు నీకు అర్థమయ్యేటట్లుగా బోధిస్తాడు. అడిగి తెలుసుకుంటావా మిత్రమా!! ఈ New Academic yearలో new class ఎలా చదివి తెలుసుకుని pass అయ్యి next class కి వెళతారో అలానే బైబిల్ కూడా చదివి క్రీస్తుప్రేమను తెలుసుకుంటారని ఆశిస్తూ...

**ప్రేమతో**

**మీ అక్కయ్య**

 **నీ చేతిలోని డబ్బు, నీ నోటిమాట రెండూ విలువైనవే వాటిని పొదుపుగా వాడితేనే నీకు విలువ.**

# నా జీవితములో దేవుడు చేసిన మేలులు

**ప్రకాశ్. కాటూరు**

దేవుని నామమునకు స్తోత్రములు, మీ అందరికీ నా హృదయపూర్వక వందనములు. నా పేరు ప్రకాష్, మాది కాటూరు గ్రామం. మా తల్లిదండ్రులకు ఇద్దరం కుమారులము, నేను చిన్న వాడిని. చదివించే ఆర్థికస్థోమత లేక మా అన్నయ్యని క్రిస్టియన్ హాస్టల్‌కి పంపారు. అలా దేవునిని తెలుసుకొని నాకు ఊహ వచ్చేసరికే అమ్మ పూజలు మాని చర్చికి వెళ్లడం ప్రారంభిం చింది. నాకేమో ఎక్కువగా ఆడుకోవడం ఇష్టం కానీ అమ్మ భయంతో ఆదివారం వస్తే సండే స్కూల్‌కి, చర్చికి వెళ్ళే వాడిని, సండేస్కూల్‌లో గిఫ్ట్ కోసం వాక్యం కంఠతా పట్టేవాడిని. నా 10 క్లాస్ వరకు కాటూరు ZPH స్కూల్లో చదువుకున్నాను. సరిగా చదవకపోతే ఎక్కడ పనిలో పెట్టేస్తారని భయంతో మార్క్స్ కోసం బట్టీ పట్టేవాడిని.

2011లో BTech చదువుకోవడానికి హైదరాబాద్‌కి వచ్చాను. అప్పటికే మా అన్నయ్య ఇక్కడ జాబ్ చేస్తూ, భాగ్యలతలోని మన చర్చికి వచ్చేవాడు. అలా నేను కూడా తనతో వచ్చాను. ఇక్కడ ఉన్న క్రమశిక్షణ, పాట పాడుతున్నప్పుడు అందరూ ఒకేసారి చప్పట్లు కొట్టడం నన్ను ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. చర్చి అంటే ఇలా కూడా ఉంటుందా అనిపించింది. ఇబ్రహీం పట్నం దగ్గర భారత్ కాలేజీలో EEEలో Free seat వచ్చింది. మా అన్నయ్య దగ్గర ఉంటూ హ్యాపీగా BTech పూర్తి చేసి మంచి జాబ్ చేయాలి అనుకునేవాడిని. కానీ అన్నయ్య Job కోసం చెన్నై వెళ్లిపోవడం వలన అన్నయ్య ఫ్రెండ్స్‌తో దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక రూమ్‌లో ఉండేవాడిని. ప్రతినెలా మా అన్నయ్య నా అవసరానికి డబ్బులు పంపేవాడు. మొదట్లో చర్చికి క్రమం తప్ప కుండా వచ్చేవాడిని. అక్కడ వాక్యాలు నాకోసమే చెబుతున్నారు అనిపించేది. నాలోని లోపాల ను ఎవరో వేలెత్తి చూపించినట్లుగా ఉండి ఎప్పుడు ఈ ప్రేయర్ అయిపోతుందా రూమ్‌కి వెళ్ళి పోదాం అనిపించేది. చాలాసార్లు దైవసేవకులు చెప్పే వాక్యం నా హృదయాన్ని గుచ్చినట్టు ఉండేది, నా హృదయం చాలా కఠినమైనది నేను దీనికి స్పందించను అనుకుని, ఇంక చర్చికి రాకుండా ఉంటే సరిపోతుంది కదా అనుకునేవాడిని కాని మా అమ్మ ఫోన్ చేసి ఈ రోజు చర్చికి వెళ్తున్నావా అని అడిగితే, వెళ్తాను అని చెప్పేవాడిని. చర్చికి వెళ్ళకపోతే ఆ వారం అంతా ఏదో తెలియని వెలితి కలిగేది. **"మేలు కోరి స్నేహితుడు గాయం చేస్తాడు"** అనే వాక్యాన్ని జ్ఞాపకం చేసుకొని చర్చికి వెళ్ళేవాడిని. అలా వెళ్తూ చర్చిలో చెప్పే వాక్యాలద్వారా నా పాపములను ఒప్పు కొని 2012 మే 27న రక్షణ పొందాను. ఆ రూమ్‌లో సమస్యలనుబట్టి ఫ్రెండ్స్ రూమ్‌లోకి మారాను. ఎంతో మంచిగా ఉండాలని ఉన్నా నేను ఉండలేకపోయేవాడిని, అపవిత్రపు ఆలోచ లను నాలో గూడు కట్టుకొని ఉండేటట్లుగా చేసుకోవడం వలన చదువు మీద శ్రద్ధ లేకుండా అయిపోయింది. ఇటు వాక్యానుసారముగా జీవించలేక అటు లోకములో ఉండలేక చనిపో

వాలి అనుకునే వాడిని, నేను చనిపోతే నన్ను కష్టపడి చదివించిన తల్లిదండ్రులను ఎంతో బాధ పెట్టినవాడినవుతాను అని అనిపించేది. **"మోడుబారిన జీవితాలను చిగురింప చేయగలవు"** అను వాక్యము నేను చనిపోవాలి అనే ఆలోచనలు రాకుండా కాపాడింది. చర్చ్ అంటే ఎంతో పవిత్రమైనదని అక్కడకు వెళ్ళి నా పాపముల విషయమై పశ్చాత్తాపపడి ఎంతో నెమ్మదితో తిరిగి రావాలని తలంచి ప్రేయర్ చేసుకునేవాడిని. ఎప్పటికైనా దేవుడు నన్ను బాగుచేస్తాడు అనే విశ్వాసం కలిగింది. నాకు వస్తున్న చెడు ఆలోచనలు పోగొట్టుకోవడం కోసం Chess ఆడడం దానిలో పజిల్స్ సాల్వ్ చేయడం మొదలు పెట్టాను.

2015లో నా చదువు అయిపోయి జాబ్ కోసం ప్రయత్నిస్తున్న రోజుల్లో English కమ్యూనికేషన్ స్కిల్స్ సరిగాలేని కారణంగా 3నెలల తర్వాత ఒక చిన్న కంపెనీలో జాబ్ వచ్చింది. నా ఫ్రెండ్స్ అది 10క్లాస్‌వాళ్ళు చేసే పని అన్నారు కానీ అమ్మానాన్న మీద ఆధార పడకుండా నాకు వచ్చే శాలరీ సరిపోతుందని అనుకొని నేను ఏమాత్రం బాధపడక, ఆ జాబ్ చేస్తూ ఫ్రీగా ఉన్న టైంలో సాఫ్ట్‌వేర్‌కి సంబంధించిన కోర్స్ నేర్చుకొనేవాడిని. తరువాత 4నెలల కి ఒక స్టార్ట్ అప్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ వచ్చింది. అక్కడ సరిగా వర్క్ చేయక పోవడంవలన మేనేజర్ అందరిముందు తిట్టేవాళ్ళు, అప్పుడు జాబ్‌మానేయాలనే ఆలోచన కలిగినప్పుడు దేవుని వాక్యాన్నిబట్టి ధైర్యం తెచ్చుకొని అక్కడ 3 సం॥లు చేసాను. తరువాత ఒక MNC కంపె నీలో కాంట్రాక్టు జాబ్ వచ్చింది. వర్క్ తక్కువ ఉండడంతో ఫ్రీ టైములో ఆన్‌లైన్ చెస్ ఆడటం మొదలుపెట్టాను, అలా ఒక గేమ్ ఓడిపోతే EGO Satisfy చేయడం కోసం ఇంకా ఎక్కువ గేమ్స్ ఆడడం అలవాటు అయిపోయింది.

2018లో జరిగిన Youthretreat ద్వారా నేను చాలా నేర్చుకున్నాను. యవ్వనకాలములో దారి తప్పిపోకుండా కాపాడినందుకు దేవునికి స్తోత్రములు. కరోనా సమయములో జాబ్ పోయినప్పటికి దేవుని దయవలన మరొక మంచి జాబ్ వచ్చింది. మా బంధువులు దేవునిని నమ్ముకోలేదు, వారితో సంబంధము ఉండకూడదు అనిపించడం వలన, చర్చ్‌లో పెద్దలు చూసిన ఆమెని 2020లో వివాహము చేసుకున్నాను. కుటుంబములో నా గర్వంవలన, నాకున్న గేమ్స్ ఆడే అలవాటువలన, ఎలా ప్రవర్తించాలో తెలియకపోవడం వలనఎన్నో శోధన లను తెచ్చిపెట్టుకున్నాను. దేవుని కృపద్వారా చెప్పబడుతున్న వాక్యాల ద్వారా నాలోని లోపా లను సరి చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. దేవుడు మాకు ఒక కుమారుడుని అను గ్రహించాడు. మా జీవితంలో ఎన్నో మానసిక, ఆరోగ్యసమస్యల్లో దైవసేవకులు చెప్పే వాక్యం ద్వారా ఎంతో ఆదరణను మరియు ధైర్యాన్ని పొందుకున్నాము. ఇంత గొప్ప పరిచర్యను ఇచ్చిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు. మా కుటుంబం దేవునికి మహిమకరంగా జీవించాలని ప్రార్థన చేయగలరు.

 **చేసే పని చిన్నదని సిగ్గుపడకు కోట్లు కూడ పెట్టిన ప్రతి ఒక్కడూ మొదట కూటికి లేనివారే అని మరువకు**

# యేసయ్య రాకడ

**"మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" 1కొరింథీ 11:26**

**1.ఆయన (యేసు) తిరిగి రావడం గూర్చిన వాగ్దానం:**

యేసు రెండవమారు భూమిమీదికి రానున్నాడన్న విషయం క్రైస్తవులకు అతి ప్రాముఖ్యమైనది. నూతన నిబంధన రచయితలు దీన్ని 300సార్లకు పైగా ప్రస్తావించారు. ఈ సందర్భములో వీరు ప్రయోగించిన భాష ఇంచుమించు అంతటా ఆజ్ఞాపూర్వకంగా ఉంది. రెండవ రాకడ నిశ్చయం అని మనం తెలుసుకోవడం ఆవశ్యకం. "అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను, మహా మహిమతోను ఆకాశ మేఘారుఢుడై వచ్చుట చూచి, భూమిమీదనున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు" **మత్తయి 24:30** "నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును". **యోహాను 14:2,3**

"ఆయన వెళ్లుచుండగా, వారు ఆకాశము వైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి - గలలియ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశం వైపు చూచుచున్నారు? మీయొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" **అపొ.కార్య 1:10,11**

"ఆర్భాటముతోను, ప్రధానదూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి యుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" **1థెస్స 4:16-18**

"దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మన కనుగ్రహించియున్నాడు" **2కొరింథీ 5:5** "సహోదరులారా, ప్రభువు రాకడ వరకు ఓపిక కలిగి యుండుడి; చూడుడి; వ్యవసాయకుడు తొలకరి వర్షమును కడవరి వర్షము

ను సమకూడు వరకు విలువైన భూఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దాని కొరకు కనిపెట్టును గదా! ప్రభువు రాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగి యుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి." **యాకోబు 5:7,8**

**యేసు ఎలా తిరిగి వస్తాడు?**

సహోదరులారా, ఆ కాలములనుగూర్చియు ఆ సమయములనుగూర్చియు మీకు వ్రాయనక్కరలేదు. రాత్రివేళ దొంగ ఏలాగు వచ్చునో అలాగే ప్రభువు దినము వచ్చునని మీకు బాగుగా తెలియును. లోకులు– నెమ్మదిగా ఉన్నది, భయమేమియులేదని చెప్పుకొనుచుండగా, గర్భిణిస్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంత మాత్రమును తప్పించుకొనలేరు– **1థెస్స 5: 1-3** "మెరుపు తూర్పున పుట్టి పడమటివరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును" **మత్తయి 24:27**

"అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహిమతోను మేఘారూఢుడై వచ్చుట చూతురు" **లూకా 21:27**. "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచినవారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు; అవును ఆమేన్" **ప్రక 1:7**

**నాటకీయమైన సంఘటనలు సంభవిస్తాయి:**

"పరలోకమును అందులో ఉన్న వాటిని, భూమిని అందులో ఉన్నవాటిని, సముద్రమును అందులో ఉన్న వాటిని సృష్టించి, యుగయుగలు జీవించుచున్న వానితోడు ఒట్టుపెట్టుకుని– ఇక ఆలస్యముండదు గాని యేడవ దూత పలుకు దినములలో అతడు బూర ఊదుబోవుచుండగా, దేవుడు తన దాసులగు ప్రవక్తలకు తెలిపిన సువార్తప్రకారము దేవుని మర్మము సమాప్తమగునని చెప్పెను." **ప్రక 10:6,7**. "మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును." **ఫిలిప్పీ 3:20,21**

**"ప్రభువైన యేసును లేపినవాడు యేసుతో మమ్మునుకూడ లేపి, మీతోకూడ తన యెదుట నిలువబెట్టునని యెరిగి....." 2 కొరింథీ 4:15**

"మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివరనుండి ఆ చివరవరకు నలుదిక్కులనుండి ఆయన ఏర్పరచుకొనినవారిని పోగుచేతురు" **మత్తయి 24:31**

“దేవుని కుమారుల ప్రత్యక్షతకొరకు సృష్టి మిగుల ఆశతో తేరి చూచుచు కనిపెట్టుచున్నది. ఏలయనగా సృష్టి, నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదుననను నిరీక్షణకలదై, స్వేచ్ఛగా కాక దానిని లోపరచినవాని మూలముగా వ్యర్థపరచబడెను” **రోమా 8:19-21**

“అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదములక్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను” **1కొరింథీ 15:24,25**

**సాతాను బంధితుడవుతాడు:**

**“మరియు పెద్ద సంకెళ్లను చేత పట్టుకొని అగాధము యొక్క తాళపుచెవిగల యొక దేవదూత పరలోకమునుండి దిగి వచ్చుట చూచితిని. అతడు అది సర్పమును, అనగా అపవాదియు సాతాను అను ఆ ఘటసర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు వానిని బంధించి అగాధములో పడవేసి” ప్రక 20:1,2**

“ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించిన వారందరియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు.” **2థెస్స 1:6-10 “ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలగదు, ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును” దాని2:44**

# మనస్థత్త్వపు విధానములు

## కృతజ్ఞత మనస్సు

(గత సంచిక తరువాయి భాగం)

**"ఆయన యెరూషలేమునకు ప్రయాణమైపోవుచు సమరయ గలిలయుల మధ్యగా వెళ్లు చుండెను. ఆయన యొక గ్రామములోనికి వెళ్లుచుండగా పదిమంది కుష్ఠరోగులు ఆయనకు ఎదురుగా వచ్చి దూరమున నిలిచి యేసు ప్రభువా, మమ్ము కరుణించమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి -మీరు వెళ్లి, మిమ్మును యాజకులకు కనుపరచుకొనుడని వారితో చెప్పెను. వారు వెళ్లుచుండగా, శుద్ధులైరి. వారిలో ఒకడు తనకు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్ధముతో దేవుని మహిమపరచుచు, తిరిగి వచ్చి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, ఆయన పాదములయొద్ద సాగిలపడెను; వాడు సమరయుడు." లూకా 17:11-16**

మొదట కుటుంబములోని తండ్రికి కృతజ్ఞతగా ఉండని కుమారుడు, రెండవది పొరుగువాని యొక్క మేలుని మరచిపోయిన వ్యక్తి, మూడవది మహా అద్భుతమును చేసిన గురువుని మరచిపోయిన 9 మంది. కుష్ఠ రోగము అనేది చాలా భయంకరమైన వ్యాధి, అది మరణము వరకు ఉండే వ్యాధి, వారిని ఆ గ్రామంలో కూడా ఉండనివ్వరు. యేసు ప్రభువు ఆ పదిమంది కుష్ఠ రోగులను యాజకులకు కనపరచుకోమని చెప్పాడు, వారు వెళ్ళుచుండగానే స్వస్థత పొందుకొన్నారు. వారిలో ఒక్కడు మాత్రమే యేసుప్రభువు ఎదుట ఆయన చేసిన మేలులను బట్టి కృతజ్ఞతలు చెల్లించాడు. దేవుడు మనుష్యులు కృతజ్ఞత కలిగి జీవించాలని ఎందుకు అనుకుంటాడంటే కృతజ్ఞతవలన ప్రేమానురాగాలు, దయ కరుణలు ఉంటాయని దాని వలన సమాజం బాగుపడుతుందని. కేవలం ఒక్క వ్యక్తికి మాత్రం కృతజ్ఞత ఉంది కానీ 9మంది మరల వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయారు.

**"అందుకు యేసు -పదిమంది శుద్ధులైరి కారా; ఆ తొమ్మండుగురు ఎక్కడ? ఈ అన్యుడు తప్ప దేవుని మహిమపరచుటకు తిరిగి వచ్చినవాడెవడును అగపడలేదా అని చెప్పి నీవు లేచి పొమ్ము, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని వానితో చెప్పెను. లూకా 17:17-19**

దేవుడు మనము ఎంతగా కృతజ్ఞత కలిగి ఉండాలనుకొంటున్నాడో చూడండి. కాబట్టి మనము కృతజ్ఞత కలిగి ఉండడానికి శ్రద్ధ కలిగి ఉండాలి. ఎవరైనా మనకు మనుష్యుల పట్ల కృతజ్ఞత లేకుండా చేసే ద్వేషపు మాటలు చెప్పినా వాటిని మనం విడిచిపెట్టాలి. మనం కృతజ్ఞత లేని మాటలు మాట్లాడకుండా జాగ్రత్తపడాలి.

"వారు యేసునొద్దకు వచ్చి నీ వలన ఈ మేలు పొందుటకు అతడు యోగ్యుడు; అతడు మన జనులను ప్రేమించి మనకు సమాజ మందిరము తానే కట్టించెనని ఆయనతో చెప్పి మిక్కిలి బతిమాలుకొనిరి.

కొంతమంది యేసు ప్రభువు దగ్గరకు వచ్చి ఒక వ్యక్తి కోసం సిఫార్సు చేస్తున్నారు. ఆ వ్యక్తి 100 మంది మీద అధికారి.అతని గురించి ఏమని సిఫార్సు చేసారంటే శతాధిపతి యొక్క దాసునికి అనారోగ్యంగా ఉంది కాబట్టి ప్రార్థించమని బ్రతిమాలుకొన్నారు. అతను మన జాతికి సంబంధించినవాడు కాకపోయినప్పటికీ అతడు మన జనులను ప్రేమించి సమాజమందిర మును కట్టించాడు కనుక నీ వలన అతడు మేలు పొందటానికి యోగ్యుడు అంటున్నారు. మిగిలిన వారు ఆ సంగతిని మరిచిపోయి ఉండవచ్చు కానీ వీరు మాత్రం కృతజ్ఞత కలిగి యేసుక్రీస్తుతో శతాధిపతి యొక్క దాసుడు స్వస్థపడునట్లు ప్రార్థించమని వేడుకొంటున్నారు. వారు అతని పట్ల ఎంతో కృతజ్ఞత కలిగి యున్నారు. నీ జీవితంలో నువ్వు ఎంత కృతజ్ఞతతో బ్రతుకుతున్నావు ? నీ ఆలోచనా విధానం ఎలా వుంది? నీ పైన ఆత్మ సంబంధమైన గురువుగా వున్న వారు, ఎంతో మంది నీకు మంచి చెప్పిన వారు, నీకు మంచి చేసిన వారు మరియు నీ జీవితానికి ఒక దారి చూపించిన వారు ఇలా మన జీవితములో అనేకమంది ఉంటారు, వారిపట్ల మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. కృతజ్ఞత ఎవరు కలిగి ఉండరో వారే నష్టపోతారు అనే సత్యాన్ని గుర్తుపెట్టుకోవాలి. చేసిన మేలులు మరిచిపోని వ్యక్తి అని దేవుడు మరియు నీతోటి వారు సాక్ష్యం ఇచ్చేవాడివైతే అంత కంటే ధన్యత మరొకటి లేదు. దేవుడు ఈ కృతజ్ఞత గల మనస్సు అనేది ప్రతి ఒక్కరి హృదయములో సువివరముగా ముద్రించును గాక.

**ఇంకా ఉంది**


YouTube Live

YouTube Channel Name:
**DEVUNI SPARSHA**

**ఆదివారం ఆరాధనలు**

భాగ్యలత : ఉ॥ 8:00 - 10:00 గం॥

పెద్ద అంబర్‌పేట : ఉ॥ 9:30 - 12:00 గం॥

చింతల్ : రా॥ 7:00 - 9:00 గం॥

వీక్షించగలరు


**మధ్య తరగతి లైఫ్ అంటే కష్టంలో నీ స్థాయిని, ఖర్చులో నీ స్థోమతను చూపిస్తుంది.**

# దైవచిత్తాన్వేషణ

**(యౌవనుల ప్రత్యేకము) సేకరించబడింది**

అదేవిధముగా లేమి కలిగియున్న ఒక సహోదరుని మనము చూచినట్లయితే, మనము అతనికి సహాయము చేయవలెనని బైబిల్ మనకు స్పష్టముగా బోధిస్తున్నది **(యాకోబు 2:15,16; 1యోహాను 3:17)**. లేక ఒకవేళ నీతోటి విశ్వాసితో నీకు వ్యాజ్యమున్నట్లయితే మరియు దానిని బట్టి నీవు కోర్టుకు వెళ్ళాలా, వద్దా అని తెలుసుకోవాలనుకుంటే బైబిలు **"వెళ్ళకూడదు"** అని సూత్రప్రాయముగా చెప్పుచున్నది **(1కొరింథీ 6:1-8)**. అబద్ధము మరియు దొంగతనము ఎప్పుడూ తప్పే అని కూడా బైబిలు బోధిస్తున్నది **(ఎఫెసీ 4:25,28)**. నీవు నీ సహోదరుని బాధించినందు వలన నీకు, నీ సహోదరునికి మధ్య విరోధమున్నట్లయితే, మరలా ఇక్కడ మనము ఏమి చేయాలో అనే సందేహానికి బైబిలు తావివ్వడం లేదు. నీవే మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానపడుము **(మత్తయి 5:21-24)**.

మనము ఒక సంస్థతో ఒప్పంద పత్రము మీద సంతకం చేసినట్లయితే, మరొక చోట మెరుగైన ఉద్యోగము మనకు వచ్చినప్పుడు మనము ఆ ఒప్పందమును రద్దు చేసుకొనుటకు దేవుని చిత్తము కొరకు చూడనవసరం లేదు . దేవునితో నివసించువాడు **"అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు" (కీర్తన 15:4) మరియు అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు సత్యవర్తనులు (మాట నిలబెట్టుకొనువారు) ఆయనకిష్టులు (సామె12:22)** అని బైబిల్ మనకు చెప్పుచున్నది. ఒక విశ్వాసి తన మాటను నిలబెట్టుకోనట్లయితే అది అవమానము మరియు సిగ్గుచేటు.

అదే విధముగా మనము ఎవరికీ ఏమీ అచ్చియుండకూడదని కూడా బైబిల్ బోధించు చున్నది **(రోమా 13:8)**.

దేవుని వాక్యము మనకు ఖచ్చితమైన ఆజ్ఞలే కాక, మనలను నడిపించుటకు కావలసిన నియమములను కూడా ఇస్తున్నది. ఉదాహరణకు ఒక యౌవనస్తుడు వివాహము కొరకు చూస్తున్నప్పుడు సమాజంలోని ఇతరుల వలె అతడు కూడా కట్నం అడగాలా? లేదా అనే సంది గ్ధతలో ఉండవచ్చును. దురాశను గూర్చి, ధనాశను గూర్చి జాగ్రత్త పడమని దేవుని వాక్యము స్పష్టముగా హెచ్చరించుచున్నది. లేఖనముల సారాంశమేదనగా, మనము పుచ్చుకొనుటకంటే ఇచ్చుట నేర్చుకొనవలెను అనునదియే **(అపొ॥కా 20:33-35)**. కట్నం అడిగే (కేవలం ఆశ పడినా కూడా) ఎవరినీ కూడా దేవుడు ఆమోదించడు అని ఎంతో స్పష్టముగా తెలుపబడింది.

జూదము ఆడుట వలన సంపదను పోగుచేసుకొనుటను గురించి ఏమిటి? చెడు దృష్టిగల వాడు ఆస్తి సంపాదింప ఆతురపడును. తనకు దరిద్రత వచ్చునని వానికి తెలియదు అని

**సామెతలు 28:22**లో చెప్పబడినది. **(సామెతలు 13:11, 28:20, మరియు 1 తిమోతి 6:9-11).** ఈ వాక్య భాగముల నుండి మనకు స్పష్టముగా తెలియబడినదేమంటే ఒక విశ్వాసి లాటరీలో కానీ, పందెములోకానీ, జూదములోకానీ పాలుపంచుకొనుటకు దేవుడు ఆమోదించడు.

దేవుని వాక్యము **"(మన) త్రోవకు వెలుగును మరియు పడిపోకుండా (మన) పాదములకు దీపము నైయున్నది" కీర్తన 119:105**.

ఏదో కొన్నిసార్లు మాత్రము, మన అనుదిన బైబిలు పఠనములో ఏదో ఒక వాక్య భాగము ద్వారా దేవుడు తన నడిపింపును నిశ్చయపరచవచ్చును. కానీ ఈ విషయంలో చాలా జాగ్రత్త తీసుకోవాలి. సాధారణముగా మనము ఆ వాక్య భాగములో లేని దానిని చదువుతూ ఉంటాము. సాధారణంగా మనము అటువంటి వాక్యభాగాల కొరకు చూడకుండానే అవి మన గమనమునకు వస్తాయి. మన అనుదిన పఠనములో సలహాల కొరకు వచనములను చూచుట తెలివి తక్కువ పని. మౌన ధ్యాన సమయము (Quiet Time) యొక్క ఉద్దేశ్యము అది కాదు. ఈ విధముగా చేస్తే మనము సులభముగా తప్పు దారిలో నడిపించబడతాము.

ఒక యౌవనస్తుడు, దేవుడు తనను భారతదేశములో ఉండమని చెప్పినప్పటికీ అమెరికా వెళ్ళుటకు ఎంతో ఆసక్తిగా ఉండవచ్చును. పశ్చిమ దేశాల యొక్క ఆకర్షణీయమైన సంపద అతని మీద గట్టి పట్టు కలిగియుండుటనుబట్టి "పడమటి వైపుకు.......పరుగెత్తి (ఎగిరి) పోవుదురు" **(యెషయా 11:4)** అను ఇటువంటి వాక్యమును అతడు చూసినప్పుడు, దేవుడు నన్ను అక్కడకు వెళ్ళమని ప్రోత్సహించుచున్నాడని వెంటనే అతడు చెప్పును. మన హృదయములు మోసకరమైనవి మరియు అపవాది నిగూఢ (నర్మగర్భమైన) శత్రువు. ఈ రెండింటిని గూర్చి మనము జాగ్రత్తగా ఉండాలి.

**సేకరించబడింది**

**(ఇంకా ఉంది)**

# Finding God's Will

**-Youth Special (sourced)**

Similarly, if we see a brother in material need, the Bible clearly teaches that we are to help him (James 2:15,16;1 John 3:17). Or if you have a dispute with a fellow-believer and you want to know whether to go to court or not, the Bible emphatically says, "No" (1 Cor. 6:1-8). The Bible also teaches that lying and theft are always wrong (Eph. 4:25,28). If there has been some estrangement between you and another believer, because you hurt him in some way, again the Bible leaves no room for doubt to what you yourself (Matt. 5:21-24).

If we have signed a contract or a bond with any firm or institution, there is no need to seek God's will as to whether we can break the contract or "jump" the bond, when a more attractive vacancy offers itself elsewhere. The Bible tells us that the person who dwells with God "keeps a promise even if it ruins him" (Psa. 5:4-TLB) and also that God “delights in those who keep their promises and abhors those who don't" (Prov.12:22-TLB). It is a shame and a disgrace when a believer does not keep his

Similarly, the Bible also teaches that we should not remain in debt to anyone (Rom. 13:8).

Besides specific commands, the Word of God lays down guiding principles too. For example, when contemplating marriage a young man may wonder whether he should ask for dowry as others in his society do. God's Word clearly warns us to beware of covetousness and of the love of money. The overall teaching of Scripture is also that we should learn to give rather than receive - much less demand (cf. Acts 20:33-35). It is clear then that God can never approve of anyone asking (or even hoping) for a dowry.

What about the acquisition of wealth by games of chance? Proverbs 28:22 (TLB) says, "Trying to get rich quick is evil and leads to poverty" (cf. Prov. 13:11; 28:20; and 1 Tim. 6:9-11). From these passages it is clear that God does not approve of a believer taking

part in any form of lottery or betting or gambling.

God's Word is indeed "a flashlight to light the path ahead (of us) and keep (us) from stumbling" (Psa. 119:105-TLB).

On rare occasions, God may confirm His guidance to us through some specific passage in our daily Bible reading. But care is needed for we are often likely to read into a passage what is not basically there. Usually

such passages are brought to our attention without our looking for them. It is unwise to look for suggestive verses in our daily Bible-reading, for that is not the purpose of the *Quiet Time*, and we can easily be led astray
thereby.

A young believer may be keen on going to the U.S.A. when God wants him to remain in India. The material attractions of the West may, however, have such a strong hold on him that when he finds a verse like, "They

shall fly... toward the West" (Isa. 11:14), he will immediately conclude that God is encouraging him to go. Our hearts are deceitful and the Devil is a subtle foe. We need to be on our guard against both.


## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన – 2025, **ఆగష్టు 15వ** తేది (శుక్రవారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

**స్థలం: పెద్ద అంబర్‌పేట మందిరము**

వివరములకు:

**9666666249**
**040-24202227**




# బైబిల్ క్విజ్ -101

(ప్రకటన గ్రంథము నుండి ఇవ్వబడినది)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1. తన మొదటి ప్రేమను వదిలివేసిన సంఘము ఏది?**

**2. పట్టణ ప్రాకారపునాదులను అలంకరించడానికి వాడబడిన పన్నెండవ రత్నము పేరు ఏమిటి?**

**3. తుయతైర సంఘములో ప్రవక్త్రిని అని చెప్పుకొనుచున్న స్త్రీ పేరు ఏమిటి?**

**4. ఎన్ని సంవత్సరాల పాటు అపవాది బంధించబడతాడు?**

**5. యూదా గోత్రపు సింహము ఎవరు?**

**6. ఒక్క గడియలోనే నాశనమైన మహాపట్టణము ఏది?**

**7. ఏ మహానది వద్ద నలుగురు దూతలు బంధించబడ్డారు?**

**8. ఏ సంఘము దేవుని వాక్యమును గైకొనినది?**

**9. నులివెచ్చని సంఘముగా పేర్కొనబడిన సంఘము ఏది?**

**10. మరణము వరకు నమ్మకముగా ఉండువానికి ఏ కిరీటము ఇవ్వబడుతుంది?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబర్ 2025 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :-** ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 100 జవాబులు ( 26నుండి 30వ పుస్తకము వరకు ఇవ్వబడింది)**

**1. ఆమోసు (ఆమోసు 1:1)**
**2. ఆమోసు (ఆమోసు 8:11)**
**3. యెహెజ్కేలు (యెహె 3:15)**
**4. దేవుడు అడిగెను (యెహె 22:14)**
**5. నోవహు, దానియేలు, యోబు (యెహె 14:14)**
**6. బబులోనురాజు (యెహె 21:21)**
**7. బెల్షస్సరు (దాని 5:6)**
**8. హోషేయకు (హోషే 1:2)**
**9. ఎఫ్రాయిము, షోమ్రోను, (హోషే 7:1)**
**10. యోవేలు (యోవేలు 1:5)**

**బైబిల్ క్విజ్ - 100 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

ఎమ్ రాజు ఫ్లోరెన్స్, ఉషారాణి(BHEL), కె. గణేష్ (చింతల్), ఆర్. ఐజాక్ కుమారి, కె.పాపరమేష్, నిస్సీజేమ్స్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

" నీ దేవుడైన యెహోవా కన్నులు
సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు
మీ జీవితముల మీద ఉండును గాక ! "

## జూలై - ఆగష్టు

ఎపఫ్రా మినిస్ట్రీస్ కుటుంబములో
జూలై, ఆగష్టు నెలలో పుట్టిన వారందరికి
ఎపఫ్రా మినిస్ట్రీస్ తరుపున హృదయపూర్వకమైన
జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2025, మే1వ తేదిన జరిగిన ఉపవాస ప్రార్థనలో అనేకులు పాల్గొని దేవుని ప్రార్థించుట జరిగినది.

2025, మే1వ తేదిన జరిగిన ఉపవాస ప్రార్థనలో
అనేకులు పాల్గొని దేవుని ప్రార్థించుట జరిగినది.



# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph : 040-24202227 Cell : 9666666249
email : mail2church@gmail.com | web : www.epaphra.org

Published by: T. Epaphras, Plot No.1, Shanti Nagar, Opp. Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-5000070, Hyderabad.
Printed by: Charisma Printers Pvt. Ltd, # 6-1-91/37-40, Sensation Theatre Road, Lakadi-ka-pool, Hyderabad (TS) 500004 | Editor: Bro. T.Epaphras